క్లుప్తంగా

కటికపల్లిలో కంటివెలుగు శిబిరం



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కందుకూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలోని కటికపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక సర్పంచ్ నరేందర్‌గౌడ్‌తో కలిసి వారు ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, కృష్ణారెడ్డి, దీక్షిత్‌రెడ్డి, వైద్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్‌తో అనుసంధానం చేసుకోండి: తహసీల్దార్

తలకొండపల్లి: ఓటర్‌కార్డును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణ అన్నారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఒకే ఇంటి నంబర్‌తో 6 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లను గుర్తించడం జరిగిందన్నారు. ఆ ఓటర్లందరూ ఒకే ఇంటిలో నివసిస్తున్నారా లేదా అని విచారణ చేశామన్నారు. మండలంలో 143 మందికి చెందిన ఇంటి నంబర్లు తప్పుగా ఉన్నాయని.. అవి మార్చడానికి వారివారి ఆధార్‌కార్డును తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రాయితీపై పచ్చిరొట్ట, జనుము విత్తనాలు: ఏఓ

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 65 శాతం రాయితీపై జనుము, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టా పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని విస్తరణాధికారిని సంప్రదించాలని రైతులకు సూచించారు. 40 కేజీల బస్తా రూ.3500 ఉండగా.. రాయితీపై రూ.1225కి లభిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

ఇబ్రహీంపట్నం: విద్యుత్‌ఘాతానికి గురై గొర్రె మృత్యువాత పడిన సంఘటన సోమవారం యాచారం మండల పరిధిలోని మేడిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యాదయ్య గొర్రెలు.. గడ్డి మేసుకుంటూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాయి. అక్కడ విద్యుదాఘాతానికి గురై ఒక గొర్రె మృత్యువాత పడింది. విద్యుత్ అధికారులు తనకు నష్టపరిహారం ఇవ్వాలని బాధితుడు కోరుతున్నాడు.

పేద మహిళ కంటి ఆపరేషన్‌కు చేయూత



బిజిలీ బాయిని పరామర్శిస్తున్న నేతలు

దిల్‌సుఖ్‌నగర్: పేద ప్రజలకు నిరంతరం చేయూత నందిస్తానని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కే పురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ బస్తీ నివాసి అయిన బిజిలీ బాయ్ అనే 77 సంవత్సరాల వృద్ధ మహిళకు కంటి చూపు లేక ఇబ్బందులకు గురైతుందని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఉపేందర్‌రెడ్డి మహిళకు నేత్రలాయ ఆసుపత్రిలో తన సొంత డబ్బులతో కంటి ఆపరేషన్ చేయించారు. ఈసందర్భంగా సోమవారం హాస్పిటల్‌కు వెళ్లిన ఉపేందర్‌రెడ్డి బిజీ బాయ్‌ను పరామర్శించారు. కళ్యాణ్ యాదవ్, రాజునాయక్ పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి: సర్పంచ్



దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న నాయకులు

మంచాల: వడగండ్ల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ డిమాండ్ చేశారు. మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో వడగండ్ల వర్షాలకు దెబ్బతిన్న పంట చేలను సోమవారం వారు పరిశీలించారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఉప సర్పంచ్ జంగయ్యగౌడ్, రైతుబంధు కన్వీనర్ చిందం రఘుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాషా, నాయకులు జంగయ్య పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- మహేశ్వరంలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- అసైన్డ్ భూములు, చెరువులు, కుంటల్లో అనుమతులు లేకుండా తవ్వకాలు
- అధికార, ప్రతిపక్ష నేతల కనుసన్నల్లోనే దందా!
- అడ్డుకట్ట వేయాలంటున్న ప్రజలు



నాగిరెడ్డిపల్లిలోని అసైన్డ్ భూమిలో మట్టి తవ్వకాలు

మహేశ్వరం: మండలంలో అక్రమ మట్టి దందా మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లుగా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, చెరువులు, కుంటలనుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇటుక బట్టీ వ్యాపారులు, ఇళ్ల నిర్మాణాలకు విక్రయిస్తున్నారు. మట్టి తవ్వకాల తంతు బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి, కోళ్లపడకల్, దుబ్బచర్ల, ఆకన్‌పల్లి, కొత్త తండా, తుమ్మలూరు, సిరిగిరిపురం తదితర గ్రామాల్లో అసైన్డ్, చెరువు శిఖం, ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రి వేళల్లో జేసీబీలు, హిటాచీలతో మట్టిని తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. టిప్పర్లలో మట్టిని తరలిస్తున్న క్రమంలో స్థానికంగా ఉన్న బీటీ, సిమెంట్ రోడ్లు పాడవుతున్నాయి. దుమ్ము, ధూళితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

విచ్చలవిడిగా తవ్వకాలు..

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో టీఎస్ఐఐసీ అధికారులు ఐటీ పార్కు ఏర్పాటు కోసం సేకరించిన ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో కొందరు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. రైతులు కూడా మా భూమి ఏలాగో టీఎస్ఐఐసీ తీసుకుంటుంది మట్టిని తవ్వేసి అమ్ముకుంటే డబ్బులు వస్తాయి. ప్రభుత్వం టీఎస్ఐఐసీ వారు ఎకరానికి నష్టపరిహారం ఇస్తారు అనే దురాశతో మట్టి వ్యాపారులతో చేతులు కలిపి మట్టిని తవ్వేసి విక్రయించుకుంటున్నారు.

బడానేతల కనుసన్నల్లోనే..

మండలంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నేతలు జతకట్టి మట్టి వ్యాపారం సాగిస్తున్నారంటూ ఆరోపణలు ఉన్నాయి. రోజూ రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకు మట్టి తవ్వి.. టిప్పర్‌కు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు వెంచర్లు, ఇటుక బట్టీలకు విక్రయించుకుంటూ కోట్లు గడిస్తున్నారు. అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మట్టి తవ్వకాల్లో గొడవలై ఇద్దరు నేతలు ఒకరిపై మరొకరు పోలీసులకు పిర్యాదు చేసుకునేవరకు వెళ్లింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే భౌతిక దాడులకు పాల్పడుతున్నారు.

అక్రమార్కుల ఆటకట్టిస్తాం



మండలంలో మట్టి తవ్వకాలు చేపట్టడానికి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. ఇదివరకు మండలంలో పలు గ్రామాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీలను సీజ్ చేయడంతో పాటు రూ.2 లక్షల వరకు జరిమానాలు విధించాం. ప్రభుత్వ, అసైన్డ్, శిఖం భూముల్లో మట్టి తవ్వకాలు చేపడితే సదరు రైతు భూమిని పీఓటీ కింద తీసుకొని మట్టిని తరలిస్తున్న జేసీబీలు, టిప్పర్లను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.రాత్రివేళల్లో గట్టి నిఘా ఏర్పాటుచేస్తాం. అక్రమార్కుల ఆటకట్టిస్తాం.

– మహమూద్ అలీ, తహసీల్దార్, మహేశ్వరం

సమస్యల పరిష్కారానికి కృషి

యూత్ కాంగ్రెస్ నేత రాఘవేందర్‌రెడ్డి



కాలనీవాసులకు నగదు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లోని తిరుమలనగర్‌లో యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తన సొంత నిధులతో వీధిలైట్లు ఏర్పాటు చేసేందుకు కాలనీవాసులకు నగదు అందజేశారు. కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ తిరుమలనగర్‌లోని రోడ్ నంబర్ 3, 4 లో వీధిలైట్ల లేక ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు రాఘవేందర్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఆయన వీధి లైట్లకోసం సొంతనిధులను కాలనీవాసులకు అందజేశారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా తనను సంప్రదించాలని కోరారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న జంగారెడ్డి

జెడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో జెడ్పీ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీపీ మంద జ్యోతిపాండు, స్థానిక సర్పంచ్ గంగాపురం గోపాల్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయన్నారు. మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి సహకారంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఈశ్వర్‌గౌడ్, మాదాపూర్ సర్పంచ్ సాయిలు, బీఆర్‌ఎస్ నాయకులు కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మీర్‌పేట: పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మీర్‌పేట కార్పొరేషన్ లెనిన్‌నగర్ ప్రశాంత్‌నగర్ ఫేజ్–1లోని అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ లైఫ్, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి నిల్వ, వర్షపునీటి నిల్వ, సురక్షితమైన నీరు, ఇంకుడుగుంతల ప్రాధాన్యతపై గర్భిణులకు వివరించారు. అదే విధంగా ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానకుమారి, అంగన్‌వాడీ టీచర్ సంగీత, హెల్పర్ శ్వేత, ఎల్‌ఎంఎస్‌సీ కమిటీ అధ్యక్షురాలు పద్మ, యూత్ ప్రెసిడెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగేలా పనులు చేపట్టొద్దు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలలో ప్రజలకు ఇబ్బంది కలిగేలా పనులు చేపట్టవద్దని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్ చౌరస్తాలో నిర్మిస్తున్న ఫుట్ పాత్ కారణంగా ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం ఫుట్‌పాత్ పనులపై కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ ఈఈ రమేష్‌బాబు, డీఈ దామోదర్‌రావుతో కలిసి పమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఫుట్‌పాత్ నిర్మించడం వలన రహదారి ఇరుగ్గా మారుతుందని, వాహదారులు తీవ్రఇబ్బందులు పడుతారని తెలిపారు. ప్రజలకు వాహదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, యాదగిరిగౌడ్, కృష్ణ, గోపి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, మెట్టుపల్లి సంతోష్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవి శంకర్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల అవగాహన



కడ్తాల్: ఇంకుడుగుంత పనులను ప్రారంభిస్తున్న అధికారులు

కడ్తాల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, ఈజీఎస్ ఏపీఓ లలిత పర్యటించారు. మురుగు నీరు నిలవకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. ఇంకుడుగుంతల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇంటి ఆవరణలో స్థలం ఉంటే ఈజీఎస్ సహకారంతో ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని సూచించారు. మ్యాజిక్ సోక్‌పిట్‌కు రూ.6500, కామన్ సోక్‌పిట్‌కు రూ.10300, కమ్యూనిటీ సోక్‌పిట్‌కు రూ.12 వేలు ఈజీఎస్ కింద అందజేస్తామన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి..

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్ అన్నారు. ఇటీవల మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్–2023లో విజేతలుగా నిలిచి.. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు సోమవారం మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ సన్మానించారు. జిల్లా స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

నీటిని ఆదా చేసుకుందాం..

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మిషన్ మీరి లైఫ్ సందర్భంగా మహిళలకు నీటి వనరుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ పద్మజ, సీడీపీఓ వినీత, పీహెచ్‌సీ డాక్టర్ శ్వేత, సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్ హాజరై వర్షపు నీటి సేకరణ, ఎలా నిల్వ చేసుకోవాలి, సురక్షితమైన తాగునీటి సరఫరాతో పాటు, మరుగుదొడ్డి వద్ద నీటి ఆదా వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

వర్షపు నీటిని ఒడిసిపడదాం..

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలను తవ్వి వర్షపు నీటిని ఒడిసిపట్టాలని ఇబ్రహీంపట్న ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతి కిరణ్ సూచించారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం, కప్పపహాడ్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామ పంచాయతీల్లో పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఉపాధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రోగ్రాం అధికారి తిరుపతిచారీ, పంచాయతీ కార్యదర్శులు విక్రం, శ్రీనివాస్, టెక్నికల్ అధికారులు రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను వినియోగించుకోండి

ఎంపీడీఓ రాఘవులు

ఆమనగల్లు: ప్రతి ఇంటికి ఇంకుడుగుంత నిర్మించాలని మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు సూచించారు. మాడ్గుల మండలంలోని నల్లవారిపల్లి, అవురుపల్లి గ్రామాల్లో సోమవారం ఎంపీడీఓ రాఘవులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ ఇంకుండుగుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ఆయా గ్రామాల్లో మరుగుదొడ్లకు ఒకే గుంత ఉన్నచోట అదనపు గుంతను నిర్మించి మరుగుదొడ్లను సక్రమంగా వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నల్లవారిపల్లి సర్పంచ్ పార్వతమ్మ, ఆయా గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లవెల్లి నర్సరీ పరిశీలన

ఇబ్రహీంపట్నం: నల్లవెల్లి గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పంచాయతీ రికార్డులను యాచారం ఎంపీడీఓ విజయలక్ష్మి సోమవారం పరిశీలించారు. వన నర్సరీని పరిశీలించారు. హరితహారం కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు మొక్కలను సిద్ధంగా ఉంచాలని నర్సరీ సిబ్బందిని ఆదేశించారు.

శంకుస్థాపనకే పరిమితం

- సబ్ రిజిస్ట్రార్ నూతన భవన నిర్మాణానికి గ్రహణం
- 2022 ఫిబ్రవరిలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన
- త్వరగా పూర్తిచేయాలంటున్న స్థానికులు



మంత్రి కేటీఆర్ వేసిన శిలాఫలకం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ నూతన భవన నిర్మాణ పనులు ఒక్క అడుగూ ముందుకు పడటంలేదు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని పాత బస్తీలోని పాత బస్టాండ్ వద్ద వున్న పురాతన గోదాములను తొలగించి ఆ స్థలంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి 9 ఫిబ్రవరి, 2022లో శంకుస్థాపన చేశారు. రూ.1.50 కోట్లతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అయితే శంకుస్థాపన చేసి 15నెలలు దాటినా భవన నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు.

పాతబస్తీకి కొత్త కళ వచ్చేనా..

ఒకప్పుడు కళకళలాడిన పాత ఇబ్రహీంపట్నం కొన్నేళ్లుగా వెలవెలబోతోంది. సాగర్ ప్రధాన రహదారిపైకి పోలీస్‌స్టేషన్‌ను తరలించడం ఆ రోడ్డుకు చుట్టుముట్టూ కొత్త కాలనీలు వెలియడం, పాత బస్టాండ్ కేవలం హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులకు మాత్రమే పరిమితం కావడం, పలు వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, కూరగాయలతోపాటు వివిధ మార్కెట్లు అటువైపు తరలడంతో పాతబస్తీకి వచ్చే జనసంచారం తగ్గిపోయి కళతప్పింది. అయితే సబ్ రిజిస్ట్రార్‌తోపాటు కొత్తగా వచ్చే వివిధ కార్యాలయాలు, మార్కెట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తే తిరిగి పాతబస్తీ పూర్వవైభవం సంతరించుకొని వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని స్థానికులంటున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానికులకు ఉపాధితోపాటు వ్యాపారాలు బాగా సాగే అవకాశాలు ఉంటాయని స్థానికులు అంటున్నారు.

అద్దె భవనంలో తప్పని తిప్పలు..

ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలోని ఓ ఇరుకైన అద్దె భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగుతోంది. వందలాది మంది ఈ కార్యాలయానికి నిత్యం వస్తుండటంతో ఇరుకు భవనంలో విధులను నిర్వహిస్తున్న అధికారులకు తిప్పలు తప్పడంలేదు. అంతేగాక పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లపైనే వాహనాలను నిలపాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురౌతున్నాయి. కొత్త భవనం నిర్మిస్తే ఈ ఇబ్బందులు తప్పి, అధికారులు, కార్యాలయానికి వచ్చే వారికి సౌకర్యంగా ఉంటుంది. వెంటనే నిర్మాణం పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



సబ్ రిజిస్ట్రార్ నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని పాతబస్తీ వాసులం స్థానిక ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు మొదలు అవుతాయని, టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు ఎమ్మెల్యే ఎంతో కృషిచేశారు.

– భాస్కర్, ఇబ్రహీంపట్నం, బీఆర్‌ఎస్ నాయకుడు

పనులు ప్రారంభం కాలేదు



పాత ఇబ్రహీంపట్నం అభివృద్ధి చెందాలంటే కొత్తగా ఏర్పడే ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ మార్కెట్లను ఇక్కడ ఏర్పాటు చేయాలి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేసి 15 నెలలు దాటింది. ఇంకా పనులు ప్రారంభంకాలేదు. వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

– అలీం, ఫిర్దౌస్‌మహల్, ఇబ్రహీంపట్నం

ఉపాధి అవకాశాలు లభిస్తాయి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. టిఫిన్ సెంటర్లు, టీ కొట్టులు, జిరాక్స్, డాక్యుమెంట్ రైటర్ల షాపులు ఏర్పాటు అవుతాయి. వెనుకబడ్డ పాత బస్తీ బాగుపడే అవకాశం ఉంటుంది. సబ్‌రిజిస్ట్రార్ భవన నిర్మణ పనులు ప్రారంభించి పాత బస్తీకి పూర్వ వైభవం తీసుకురావాలి.

– రమేష్‌గౌడ్, ఇబ్రహీంపట్నం

భూములను లాక్కుంటే సహించేది లేదు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళితుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

మంచాల: ఏళ్ల తరబడిగా తాము కబ్జాలో ఉన్న భూమిని యాదవులకు కేటాయించడం నిలిపివేయాలని జాపాల గ్రామ దళితులు సోమవారం మంచాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్ అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 96 సర్వే నంబర్‌లో మా తాతల కాలం నుంచి దళితులము కబ్జాలో ఉన్నామన్నారు. గ్రామంలో 68 ఎకరాలు ప్రభుత్వం భూమి ఉంది. అ భూములను కాదని కావాలని దళితులు కబ్జాలో ఉన్న 96 సర్వేనంబర్‌లో యాదవులకు ఇస్తామడం శోచనీయమన్నారు. వాస్తవాలను పరిశీలన చేసి దళితులకు న్యాయం చేయాలన్నారు. దళితులు కబ్జాలో ఉన్న భూమిని యాదవులు తీసుకోవడం కూడా సరైంది కాదన్నారు. కొంతమంది కావాలని దళితుల భూములను లాక్కొన్ని గ్రామంలో గొడవలు సృష్టించాలని చూస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ ధర్నాకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జంగయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సంజీవ, సీపీఎం మండల నాయకులు లెనిన్, ఆఫీస్ పాష, నోముల కృష్ణ, జంగయ్య, సంజీవ, రమేష్, హరికృష్ణ, పరమేష్, నందు, శివ కుమార్, విష్ణు తదితరులు మద్దతు తెలిపారు.

రోడ్డుపై గుంతలు.. వాహనదారుల ఇబ్బందులు



హస్తినాపురం ఈస్ట్ కాలనీ ప్రధాన కూడలి రోడ్డుపై గుంతలు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలో హస్తినాపురం ఈస్ట్ కాలనీలో గౌతమి మోడల్ స్కూలు సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో గుంతలు ఏర్పడి ఆ దారిన వెళుతున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హస్తినాపురం నుంచి వనస్థలిపురం వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో ఈ దారిన నిత్యం వేలాది వాహనాలు వెళుతుంటాయి, దీంతో గుంతలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.